క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్ 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జూలో ఉచిత వైద్య శిబిరం



జూలో సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న మెడికవర్ వైద్యులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడ జంతు సంరక్షకులు, పరిపాలనా విభాగం సిబ్బందికి వైద్య సేవలందించారు. రక్తపోటు, మధుమేహం, కార్డియాక్ పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఆస్పత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నిర్వహణ ఖర్చులకు ఎదురు చూస్తున్నాం'

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: రూ.40 లక్షలతో కేటాయించిన మొబైల్ టెస్టింగ్ అండ్ అవేర్‌నెస్ వాహనం నిర్వహణ ఖర్చుల కోసం ఎదురు చూస్తున్నామని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆహారంపై అవగాహన కార్యక్రమాలను అధికారులు విస్మరించిన నేపథ్యంలో 'ఆహార భద్రత గాలికి..' అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ సంస్థ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాల నిర్వహణ కోసం రూ.10 లక్షలు కేటాయించాల్సి ఉందన్నారు. నేటికీ ఎటువంటి కేటాయింపులు లేకపోవడంతో కెమికల్స్, సిబ్బంది లేక నిర్వహణ ఖర్చుల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. ఇప్పటికే ఇదే విషయమై కమిషనర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. నిధులు వచ్చిన తరువాత మొబైల్ టెస్టింగ్ అండ్ అవేర్‌నెస్ వాహనాన్ని వినియోగిస్తామన్నారు.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శన



బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థులు

బీచ్‌రోడ్డు: నగరానికి చెందిన ఒక ఫార్మసీ కాలేజీ విద్యార్థులు గురువారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను వివరించారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం గురించి విద్యార్థులకు తెలియజేశారు.

ఎంవీపీ సెంట్రల్ నర్సరీ పనుల పరిశీలన



వీఎంఆర్‌డీఏ సెంట్రల్ నర్సరీలో కమిషనర్ విశ్వనాథన్, అధికారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని వీఎంఆర్‌డీఏ సెంట్రల్ నర్సరీని గురువారం సంస్థ కమిషనర్ కె.విశ్వనాథన్ సందర్శించారు. వీఎంఆర్‌డీఏ ఇంజినీరింగ్, ఫారెస్ట్ అధికారులతో కలిసి నర్సరీలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. సుమారు రూ.కోటి వ్యయంతో గతంలోని పాత నర్సరీని వీఎంఆర్‌డీఏ సెంట్రల్ నర్సరీగా అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా జరుగుతున్న పనులపై కమిషనర్ ఆరా తీయంతోపాటు నర్సరీ రహదారి, కార్యాలయం, పంప్‌హౌస్ ఆకృతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, డీఎఫ్‌వో సుజాతా శివానీ పాల్గొన్నారు.

అక్కరకు రాని టీటీడీ e-దర్శన్



టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ ఎదుట టికెట్ల కోసం బారులు తీరిన జనం (ఫైల్)

- పునఃప్రారంభం కాని ఈ-దర్శనం బుకింగ్ సేవలు
- వెంకన్న భక్తులకు తప్పని అవస్థలు
- కోవిడ్ సమయంలో మూతపడిన ఎంవీపీ సెంటర్
- సేవలు పునరుద్ధరించాలని భక్తుల విజ్ఞప్తి

ఎంవీపీకాలనీ: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్లే స్థానిక భక్తులకు అవస్థలు తప్పడం లేదు. కోవిడ్ కారణంగా మూతపడిన ఎంవీపీ కాలనీలోని ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సెంటర్ నేటికీ అందుబాటులోకి రాలేదు. శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం ఎంవీపీ కాలనీలో ఈ-దర్శనం కౌంటర్‌ను దశాబ్దాల కిందట ఏర్పాటు చేసింది. కరోనా వైరస్ ప్రభావంతో నాలుగేళ్లుగా ఇక్కడి సేవలు నిలిచిపోయాయి. కోవిడ్ అనంతరం ఆన్‌లైన్ టికెట్ విక్రయాలను టీటీడీ ప్రారంభించినప్పటికీ ఇక్కడి ఈ-దర్శనం సెంటర్ సేవలను పునరుద్ధరించలేదు. దీంతో భక్తులు కొంతకాలంగా తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అందించిన సేవలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి సంబంధించి టికెట్ల విక్రయాలు గతంలో నెల రోజుల ముందుగానే ఇక్కడ జరిగేవి. టీటీడీ మార్గదర్శకాలకు అనుగుణంగా వారు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నెల రోజుల ముందుగానే ఆయా తేదీల్లో దర్శనం టికెట్లను విక్రయించేవారు. దీంతోపాటు తిరుమల కొండపైనా, కొండ దిగువన భక్తుల ఆసక్తికి అనుగుణంగా గదులు సైతం బుక్ చేసేవారు. రూ.300, రూ.600 టికెట్ల విక్రయాలు నిత్యం ఎంవీపీ కౌంటర్‌లో జరిగేవి. ప్రత్యేక సందర్భాల్లో శ్రీవారి కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, వసంతోత్సవం, సహస్ర దీపాలంకణ, విశేష పూజ టికెట్లు విక్రయించేవారు. భక్తులు కేవలం ఆధార్ కార్డు జిరాక్స్‌లు, డబ్బులు చెల్లించి ఆయా సేవలు పొందేవారు. గతంలో విలువైన సేవలు అందించిన ఈ కేంద్రం కార్యకలాపాలు పునఃప్రారంభం కోసం భక్తులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సెంటర్

టికెట్ల బుకింగ్‌కు అవస్థలు పడుతున్నాం

కోవిడ్ కారణంగా నిలిపేసిన ఈ-దర్శనం సేవలను టీటీడీ నేటికీ పునరుద్ధరించలేదు. దీంతో శ్రీవారి దర్శనానికి తీవ్ర అవస్థలు పడుతున్నాం. దర్శనం టికెట్ల కోసం పెద్ద ఎత్తున ప్రైవేట్ బుకింగ్ సెంటర్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అయినా టికెట్లు లభించడం లేదు. సమయానికి టికెట్లు బుక్ కాకపోవడంతోపాటు అదనపు డబ్బులు వసూళ్లు చేస్తుండటంతో నిరాశే మిగులుతోంది. ఎంవీపీ కాలనీ ఆన్‌లైన్ సెంటర్ ఈ-దర్శనం సేవలను టీటీడీ పునరుద్ధరించాలి.

– వసంతరావు, ఎంవీపీ కాలనీ

లలితాదేవికి అన్నాభిషేకం



అమ్మవారికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకుడు

ఏయూక్యాంపస్: కిర్లంపూడి లేఅవుట్‌లోని లలితా సుందరేశ్వర పీఠంలో గురువారం అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. త్రివేణీ సంగమ తీర్థ జలం , పంచ నదీజలాలతో అమ్మవారికి విశేష అభిషేకం జరిపించారు. అనంతరం సుందరేశ్వర స్వామి, వినాయకుడికి అభిషేకాలు చేశారు. మొత్తం 365 కిలోల అన్నం వండించి అమ్మవారికి వేద పండితుల సమక్షంలో అన్నాభిషేకం జరిపించారు. ఆ ప్రసాదాన్ని భక్తులకు వడ్డించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు కాందూరి లక్ష్మణ స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు.

ప్రసాదం పంపిణీ



ప్రసాదం అందిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: శివరాత్రి మహోత్సవం సందర్భంగా గురువారం పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. పందిమెట్ట జంక్షన్ వద్ద రాపాక శ్రీనివాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు భక్తులకు ప్రసాదం అందించారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్

- 83 శాతం పోలింగ్
- ఓటేసిన 620 మంది ఉపాధ్యాయులు



చినవాల్తేరులో పోలింగ్ కేంద్రం సమీపంలో ఉపాధ్యాయులు, పోలీసుల హడావుడి



తూర్పు పోలింగ్ బూత్ గేటు వద్ద రక్షణ చర్యలు పరిశీలిస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

ఆరిలోవ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ గురువారం తూర్పు నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగింది. ఇక్కడ 83 శాతం మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చినవాల్తేరు ఏయూ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. దీని కోసం జిల్లా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలో ఇది ఒక్కటే కేంద్రం కావడంతో ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, వెంకోజీపాలెం, మద్దిలపాలెం, రామ్‌నగర్, చినవాల్తేరు, పెదవాల్తేరు ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు వచ్చి తమ ఓటు వేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 10.30 గంటల వరకు మందకొడిగా సాగింది. అప్పటికి మొత్తం ఓట్లలో 18 శాతం మాత్రమే పోలయ్యాయి. అనంతరం పోలింగ్ శాతం క్రమేపీ పెరుగుతూ వచ్చింది. పోలింగ్ ముగిసే సరికి మొత్తం ఓట్లలో 83 శాతం పోలైనట్లు అధికారులు వెల్లడించారు. ఏసీపీ లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో పోలీసులు 144 సెక్షన్ విధించి ఇతరులు ఎవ్వరినీ కేంద్రం లోపలకు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. ఈ సెంటర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సందర్శించి, పోలింగ్ తీరును పరిశీలించారు. నియోజకవర్గంలోని 747 మంది ఉపాధ్యాయ ఓటర్లలో 351 మంది పురుషులు, 396 మంది మహిళలు ఉన్నారు. వారిలో 620 మంది (293 మంది పురుషులు, 327 మంది మహిళలు) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రేపటి నుంచి విజయగణపతి ఆలయ వార్షికోత్సవాలు



కొలువైన విజయగణపతి



విద్యుద్దీప కాంతుల్లో ఆలయం

ఏయూక్యాంపస్: కిర్లంపూడి లేఅవుట్‌లో కొలువైన విజయగణపతి స్వామి ఆలయ 10వ వార్షికోత్సవం మార్చి 1, 2 తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. 1వ తేదీ ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ఆరంభమవుతాయి. పుణ్యాహవచనం, పంచగవ్యం, రుత్విక్ వరుణ నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి విశేష అభిషేకం జరుపుతారు. సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్టాపన, మూల మంత్ర హోమం నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహ వచనంతో రెండో రోజు కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఉదయం 9 గంటలకు ఆలయ కలశ అభిషేకం జరుపుతారు. సాయంత్రం 5.30 గంటల నుంచి శ్రీ విజయ గణపతి స్వామి, సిద్ధి, బుద్ధి కల్యాణంతో వార్షికోత్సవ కార్యక్రమాలను ముగిస్తారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం అందజేస్తారు.

అలసిన మనసుకు.. ఐస్ బాక్సే హంసతూలిక



నిద్ర సుఖమెరగదు.. ఆకలి రుచెరగదు అన్నది నానుడి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏటా ఆర్కే బీచ్‌లో భారీగా కార్యక్రమాలు జరుగుతాయి. ఇక్కడికి వచ్చే నగరవాసులకు ఉపయుక్తంగా తాత్కాలికంగా పలు దుకాణాలను విక్రేతలు ఏర్పాటు చేసుకుంటారు. వారి పిల్లలను సైతం వెంటబెట్టుకుని పొట్టకూటి కోసం వీరు వస్తుంటారు. అలా వచ్చిన ఒక కుటుంబంలోని చిన్నారి అలసి పక్కనే ఉన్న ఐస్ డబ్బాపై నిదురించాడు. తల్లిదండ్రులు పక్కనే చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని వస్తువులు విక్రయిస్తూ కుటుంబ పోషణకు నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు. అలసిన చిన్నారి ఐస్ బాక్స్‌పై నిద్రపోగా.. తమ్ముడికి తోడుగా పక్కనే సోదరి నిలుచుని ఉంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– ఏయూక్యాంపస్

సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తజనం



జోడుగుళ్లపాలెం తీరం వద్ద సముద్ర స్నానాలకు వచ్చిన భక్తుల సందడి



జోడుగుళ్లపాలెం బీచ్‌లో పడకేసిన గరిడీ ఎద్దు

ఆరిలోవ: మహాశివరాత్రి జాగరణ పూజలు చేసిన భక్తులతో గురువారం సాగర తీరం పోటెత్తింది. ప్రతి ఏటా మాదరిగా శివరాత్రి పుణ్యస్నానాల కోసం ఆర్‌కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం, సీతకొండ బీచ్‌ల వరకు అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. జోడుగుళ్లపాలెం బీచ్‌లో అటు తెన్నేటి పార్కు.. ఇటు సీతకొండ వరకు తీరంలో ఉదయం 7 గంటల నుంచే వేలమంది భక్తులు స్నానాలు చేశారు. ఆరిలోవ, ఆదర్శనగర్, రవీంద్రనగర్, డెయిరీఫారం, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెంతోపాటు సింహాచలం, అడవివరం, వేపగుంట, పెందుర్తి తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ఈ తీరాలకు చేరుకున్నారు. పెద్దలతోపాటు చిన్నారులు ఎక్కువ మంది స్నానాలు ఆచరించి సందడి చేశారు. అనంతరం భక్తులు ఇక్కడ ఏడుగురు అమ్మవార్ల గుడి(కొత్తమ్మవారు)లో పూజలు చేశారు. ఈ ఆలయ ఆవరణలో ఏక శిలతో తయారు చేసిన ఎత్తయిన శివలింగం, నంది విగ్రహాలకు పూజలు జరిపారు. భక్తులు సముద్రంలో లోపలకు వెళ్లకుండా ఆరిలోవ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఏఆర్, మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రతి 10 మీటర్ల దూరంలో ఇద్దరేసి చొప్పున పోలీసులు నీటి లోపలకు దిగకుండా భక్తులను మైక్‌ల్లో హెచ్చరించారు.గజ ఈతగాళ్లను పడవల్లో కెరటాలకు కొంత దూరంలో నీటిలో సిద్ధంగా ఉంచారు. భక్తులకు వైద్య సిబ్బంది సేవలందించారు.

ఇసుకలో పడకేసిన గరడీ ఎద్దు

జోడుగుళ్లపాలెం బీచ్‌లో ఓ గరిడీ ఎద్దు పడకేసింది. తోటగరువు నుంచి ఓ గరిడీ ఎద్దును నిర్వాహకులు ఉదయం జోడుగుళ్లపాలెం బీచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ పుణ్యస్నానం చేసిన భక్తులు ఈ ఎద్దుకు పూజలు చేస్తారని భావించారు. నీటి వరకు వెళ్లిన ఆ ఎద్దు ఒక్కసారిగా ఇసుకలో పడకేసింది. దాన్ని తీసుకెళ్లిన యువకులు ఎంత లేపినా నిలబడలేదు. అక్కడున్న వేల మంది జనం గోల, కెరటాల ఘోషకు భయంతోనే అది మొండికేసింది. యువకులు చేసేది లేక నిరాశ చెందారు. కొంతసేపటికి భక్తుల రద్దీ తగ్గాక ఎద్దు నిలబడటంతో తోటగరువుకు తీసుకెళ్లారు.



అప్పుఘర్ తీరంలో సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

భక్తులకు ప్రసాదం పంపిణీ

సముద్ర స్నానాలకు వచ్చిన భక్తులకు స్థానిక రాజకీయ నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదం పంపిణీ కోసం వేర్వేరు చోట్ల టెంట్‌లు వేశారు. కొత్తమ్మవారు గుడి వద్ద నిర్వాహకులు భక్తులకు పులిహోర అందించారు. జోడుగుళ్లపాలెం వద్ద కార్పొరేటర్ కోరుకొండ స్వాతి, స్థానిక నాయకులు భక్తులకు పులిహోర, ప్రసాదం పంపిణీ చేశారు.

కిటకిటలాడిన అప్పుఘర్ తీరం

ఎంవీపీ కాలనీ: మహాశివరాత్రి పుణ్యస్నానాలకు తరలివచ్చిన భక్తులతో అప్పుఘర్ తీరం కిటకిటలాడింది. ఎంవీపీ కాలనీతోపాటు నగరంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. గురువారం వేకువజాము నుంచి అప్పుఘర్ తీరం సందడిగా కనిపించింది. శివరాత్రి జాగరణ చేసిన భక్తులు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరించారు. వారి భద్రతకు అనుగుణంగా జీవీఎంసీ, పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. స్నానాల అనంతరం భక్తులు అప్పుఘర్‌లోని సాగర లింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఎంవీపీ సెక్టార్–6లోని సిద్ధివినాయక పార్వతీ ముక్తీశ్వరాలయంలో నీలకంఠుడిని దర్శించి పూజలు చేశారు. అప్పుఘర్ తీరంలో భక్తులకు వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అతిథిగా పాల్గొని భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేర్ల విజయచందర్, వాసుపల్లి ఎల్లాజీ, ఉమ్మిడి కల్యాణ్, పరుపల్లి పరదేశి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, పార్టీ నాయకులు

ఎట్టకేలకు స్పందించారు.. ఫౌంటెయిన్‌ను బాగుచేశారు

సాక్షి ఎఫెక్ట్..

ఏయూక్యాంపస్: తీర ప్రాంతంలో సమస్యలపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. బీచ్ రోడ్డులోని పర్యాటక స్థలం పార్క్ హోటల్ కూడలి వద్ద డాలిఫిన్ వాటర్ ఫౌంటెయిన్‌కు మరమ్మతులు పూర్తి చేసి రంగులద్దారు. చాలా కాలంగా ఈ కూడలిలో ఉన్న ఫౌంటెయిన్ నాచు పట్టి అధ్వానంగా ఉంది. దీనిపై 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనాలు పరిశీలించిన అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఫౌంటెయిన్‌కు మరమ్మతులు చేయడంతోపాటు కొత్త రంగులేశారు. దీంతో ఈ కూడలి కొత్త వర్ణాలను అద్దుకుని దర్శనమిస్తోంది.



రంగులు వేసిన తరువాత ఫౌంటెయిన్‌కు కొత్త కళ



బీచ్ రోడ్డు కూడలిలో అధ్వానంగా వాటర్ ఫౌంటెయిన్

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోండి



గోపికుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ఎంవీపీకాలనీ: స్థానిక గాయత్రి విద్యా పరిషత్ కళాశాలలో గురువారం ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీటీవో సాంఖ్య టెక్నాలజీస్ గోపికుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఆధునిక సాంకేతికత రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. చాట్ జీపీటీ వంటి సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా ఏ అంశాన్నైనా సులభంగా నేర్చుకునేందుకు వీలుందన్నారు. భవిష్యత్ సమాజ అవసరాలకు అనుగుణంగా యువత వారి విజ్ఞానాన్ని పెంచుకోవాలని, కొత్త సాంకేతికతను ముందుగా ఒడిసిపట్టాలని సూచించారు. అనంతరం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గోపికుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.బోస్ పాల్గొన్నారు.